
నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 28 అక్టోబర్ 2024 | NIZAMABAD

# ప్రభుత్వం అక్రమ అరెస్టులను ఆపాలి

**ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్**

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 27: అక్రమ అరెస్టులను ఆపాలని, కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసం వద్ద ఆదివారం తలెత్తిన ఉద్రిక్త పరిస్థితి నేపథ్యంలో ఆయనను కలవడానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి వెళ్తున్న జాజాలను పోలీసులు ఆరెస్ట్ చేసి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతమందిని అక్రమంగా అరెస్టు చేయిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే నిరంకుశత్వంతో వ్యవహరిస్తే నూకలు చెల్లే కాలం త్వరలోనే వస్తుందని హెచ్చరించారు.



మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

# కేటీఆర్ ఇంటిపై దాడిని ఖండిస్తున్నాం..



- వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేస్తారు?
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆగ్రహం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 27: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంటిపై దౌర్జన్యంగా దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేస్తారని పోలీసులను ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీ నేత ఇంటిపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, ఎక్కడ ఏదో జరిగితే అది కేటీఆర్‌కు ఏం సంబంధమని పేర్కొన్నారు. రేవంత్ సోదరులపై చాలా ఆరోపణలు వస్తున్నాయని, వారి ఇండ్లపై పోలీసులు రైడ్ చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. స్వయంగా పోలీసులే రేవంత్‌రెడ్డి సోదరుడితో సెటిల్‌మెంట్ చేసుకోవాలని చెబుతున్నారని ఆరోపించారు. చిల్లర దాడులు తమను భయపెట్టవని, తమకు అరెస్టులు కొత్త కాదని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యం, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు ఇలాంటి దాడులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా ప్రజల్లో కేటీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి తట్టుకోవడంలేదన్నారు. ప్రజాగొంతుకైన కేటీఆర్‌కు సమాధానం చెప్పలేక చిల్లర వేషాలు వేస్తున్నారని పేర్కొన్నారు. కేటీఆర్‌ను ప్రజలే రక్షించుకుంటారని తెలిపారు. సెక్యూరిటీ లేకుండా వస్తే కేటీఆర్, రేవంత్ చరిష్మా తెలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణలో గృహ ప్రవేశాలకు దావత్‌లు జరగడం సర్వసాధారణమని, మంత్రులే పట్టపగలు తాగి తిరుగుతున్నారని ఆరోపించారు. వారికి పరీక్షలు చేస్తారా అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. చట్ట పరిధిలో పని చేయకపోతే డీజీపీ సమాధానం చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

## ఇది కక్ష సాధింపు చర్య..

**మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**



ఫ్యామిలీ ఫంక్షన్‌పై దాడి చేసి దాన్ని రేవ్ పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. కేటీఆర్ వ్యక్తిత్వాన్ని, ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు రేవంత్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇది పూర్తిగా కక్ష సాధింపు చర్య తప్ప మరేమీ కాదని పేర్కొన్నారు.

# టీయూ పాలన గాడిలో పడేనా!

*రాష్ట్రం పేరుపై ఏర్పడిన తెలంగాణ యూనివర్సిటీలో ఇక పాలన గాడిలో పడనున్నదా.. తొలి నుంచి వివాదాలకు చిరునామాగా మారిన వర్సిటీ అభివృద్ధి పథంలో ముందుకెళ్లనున్నదా.. కొంతకాలంగా ఇన్‌చార్జి వీసీలతో పాలన కొనసాగగా.. ప్రభుత్వం ఎట్టకేలకు శాశ్వత వీసీని నియమించింది. నూతన వీసీగా ప్రొఫెసర్ టి. యాదగిరిరావు ఇటీవల నియమితులవగా.. ఈ నెల 21న బాధ్యతలు చేపట్టారు. ఏడాదిన్నర తర్వాత టీయూకు శాశ్వత వీసీ రావడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో పాలనను గాడిలో పెట్టడంతోపాటు విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు నూతన వీసీ తీసుకోనున్న చర్యలపై ఆసక్తినెలకొనగా.. ఇందులో రిజిస్ట్రార్ మార్పుకూడా ఉంటుందనే ఊహాగానాలు వినిపిస్తుండడం గమనార్హం.*

*–నిజామాబాద్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- రిజిస్ట్రార్ మార్పుపై ఊహాగానాలు
- కీలక పోస్టు కోసం రేసులో సీనియర్ ఆచార్యులు
- గ్రూపులు, లీకులు, అంతర్గత కొట్లాటలకు చెక్ పెట్టేనా!
- పూర్వ వీసీ, రిజిస్ట్రార్ల తీరుతో పాలన అస్తవ్యస్తం
- నూతన వీసీ యాదగిరిరావు నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి

## కొత్త వీసీ ముందు అనేక సవాళ్లు




**తెలంగాణ** విశ్వవిద్యాలయం ఏర్పడి రెండు దశాబ్దాలకు చేరువవుతున్న ఈ కీలక సమయంలో ఐదో రెగ్యులర్ వీసీగా ప్రొఫెసర్ టి.యాదగిరి రావు రావడంతో ఆయన తీసుకోబోయే నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కుంటుపడిన పరిపాలనను గాడిలో పెట్టడం, అవినీతి, అక్రమాలతో అపకీర్తిని తెచ్చుకున్న యూనివర్సిటీకి పూర్వ వైభవం తేవడం అనివార్యమైంది. వీసీ రావడంతో వర్సిటీలో జరిగే మార్పులు, చేర్పులపై భారీగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా రిజిస్ట్రార్ మార్పు తథ్యమన్న సంకేతాలు జోరుగా కనిపిస్తున్నాయి. ప్రొఫెసర్ యాదగిరి ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్నారు. ఏడాది క్రితం పూర్వ వీసీ రవీందర్ గుప్తా ఆగడాల్లో భాగంగా టీయూలో ఏర్పడిన అలజడికి బ్రేక్ వేసేందుకు ప్రభుత్వం ప్రొఫెసర్ యాదగిరికి కీలక బాధ్యతలు అప్పగించింది. అనంతరం వీసీ జైలుకు పోవడంతో ఇన్‌చార్జి వీసీలుగా ముగ్గురు ఐఏఎస్ అధికారులు మారారు. రిజిస్ట్రార్‌గా మాత్రం యాదగిరి మాత్రమే కొనసాగుతూ ఆయన మార్గదర్శకంలోనే పరిపాలన సాగింది. కానీ గత ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం చేకూరలేదు. పైగా కాంగ్రెస్ సర్కారు ఆశిస్తున్న ఆశయం కూడా మరుగన పడుతోంది. టీయూ భూములను రక్షించడంలో ఏర్పడిన వైఫల్యం ఎవరూ పూడ్చలేని లోపంగా పరిగణించింది. ఈ దశలో టీయూకు నూతన రిజిస్ట్రార్ రావడం ఖాయమని తెలుస్తోంది.



### రేసులో పలువురు ఆచార్యులు..

రిజిస్ట్రార్ మార్పు అనివార్యం కానున్నది. ప్రొఫెసర్ యాదగిరి నియామకమై సుదీర్ఘ కాలం అవుతోంది. శాశ్వత వీసీని తొలగించిన తర్వాత ఇన్‌చార్జి వీసీ పాలన కాలంలో అన్నీతానై వ్యవహరించారు. దీంతో వర్సిటీలో పూర్తి స్థాయిలో పట్టు తెచ్చుకున్నప్పటికీ కీలకమైన అంశాల్లో వర్సిటీని గాడిలో పెట్టలేకపోయారన్న అపవాదును ఎదుర్కొంటున్నారు. రూ.కోట్లు విలువ చేసే భూముల రక్షణలో వైఫల్యతను మూటగట్టుకుంటున్నారు. జిల్లా యంత్రాంగంపై నెపాన్ని వేసి తప్పించుకుంటున్నప్పటికీ విద్యార్థులు, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది అంతా కీలక బాధ్యతల్లో ఉన్న వ్యక్తినే బాధ్యుడిగా చూపిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న టీయూ భూముల విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నాయకుడితో ఏర్పడిన న్యాయపరమైన చిక్కుల్లో ప్రైవేటు వ్యక్తులదే పైచేయిగా నిలవడం ప్రతి ఒక్కరినీ కలవరపెడుతున్నది. కీలకమైన ఈ కేసు ను ఛాలెంజ్ గా తీసుకుని న్యాయ స్థానాల్లో పోరా టం చేయాల్సిన సమయంలో జిల్లా యం త్రాం గం, టీయూ పెద్దలెవ్వ రూ అంతగా శ్రద్ధ చూపకపోవడంతో కోర్టులో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలతలు ఏర్పడ్డాయి. సుప్రీం కోర్టులో ఈ కేసును సవాల్ చేసి భూములను తిరిగి చేజిక్కించుకునే ప్రయత్నాల్లో భాగంగా వర్సిటీ పెద్దలు పూనుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ దశలో ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న వ్యక్తిని మార్చి వేరొకరిని నియమించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. మరోవైపు టీయూలోనే దశాబ్దాలుగా పని చేస్తున్న సీనియర్ ఆచార్యులంతా ఇదే విషయాన్ని తెర మీదకు తీసుకు వచ్చి రిజిస్ట్రార్‌గా అవకాశం దక్కించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

### గతమంతా గందరగోళం..

టీయూలో విద్యా బోధన, పరిపాలన తీరు ఏ విధంగా ఉందో గడిచిన మూ డేండ్ల కాలంలో చోటుచేసుకున్న పరిణమాలతోపాటు రిజిస్ట్రార్ల మార్పు అంశాన్ని పరిశీలిస్తే సరిపోతుంది. గౌరవ మర్యాదలు లేకుండా నిబంధనలు అమలు జరుగకుండా జరిగిన విడ్డూరకరమైన పరిస్థితులు ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురి చేశాయి. 2021, మే 22న తెలంగాణ యూనివర్సిటీకి వీసీగా ప్రొ.రవీందర్ గుప్తా నియమితులయ్యారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయనను తొలగించేంత వరకు ఇష్టానుసారంగా రిజిస్ట్రార్లను మార్చుకుంటూ పోయారు. వీసీగా వచ్చి రాగానే సెప్టెంబర్ 1న రిజిస్ట్రార్‌గా ఉన్న ప్రొ.నసీమ్‌ను తొలగించి ప్రొ.కనకయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వివాదాస్పదంగా మారిన వీసీ రవీందర్ గుప్తా తీరుతో టీయూ పాలక మండలి 2021 అక్టోబర్ 30న యూనివర్సిటీలో సమావేశమై ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న కనకయ్యను తొలగించి యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమించింది. పాలక మండలి ఆదేశాలను ధిక్కరించి ప్రొ.శివశంకర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు. తాను చెప్పినట్లు వినట్లేదని, సంతకాలు చేయట్లేదని భావించిన వీసీ ఏకంగా ప్రొ.శివశంకర్‌ను సైతం తప్పించి విద్యావర్ధినికి బాధ్యతలు అప్పగించారు. విద్యావర్ధిని నియామకాన్ని ఈసీ రద్దు చేసి ప్రొ.యాదగిరికి రిజిస్ట్రార్ బాధ్యతలను అప్పగించింది. రోజుల వ్యవధిలోనే ఓయూకు చెందిన మహిళా ప్రొఫెసర్‌ను రిజిస్ట్రార్‌గా వీసీ నియమించగా ఆ నిర్ణయాన్ని ఈసీ ఆపి తిరిగి ప్రొ.యాదగిరికి బాధ్యతలు అప్పగించగా ఆయనే ప్రస్తుతం కొనసాగుతున్నారు.

# నిజామాబాద్‌కు చేరుకున్న బీసీ కమిషన్ బృందం

- స్వాగతం పలికిన అధికారులు



జిల్లా అధికారులతో సమావేశమైన బీసీ కమిషన్ బృందం సభ్యులు

కంఠేశ్వర్/ ఖలీల్‌వాడి, అక్టోబర్ 27: రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధులు బృందం ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నది. కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి విచ్చేయగా, స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథిగృహంలో వారికి అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి స్రవంతి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లా అధికారులతో భేటీ కాగా..స్థానిక పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు. అనంతరం బృందం సభ్యులు శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానం సందర్శన కోసం బాసర పుణ్యక్షేత్రానికి బయల్దేరి వెళ్లారు. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణను పూర్తి చేసుకుని తిరిగి నిజామాబాద్‌కు చేరుకుంటారు. ఈనెల 29న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు.



బెటాలియన్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

# సస్పెండ్ చేసిన కానిస్టేబుళ్లను విధుల్లోకి తీసుకోవాలి


## క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన ఏడో బెటాలియన్ కానిస్టేబుళ్లు

డిచ్‌పల్లి, అక్టోబర్ 27 : రాష్ట్రవ్యాప్తంగా ఒకే పోలీస్ వ్యవస్థను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ వివిధ బెటాలియన్లలో పోలీసు కానిస్టేబుళ్ల కుటుంబీకులు నిరసనలు చేపడుతున్నారు. దీంతో 39 మంది స్పెషల్ కానిస్టేబుళ్లను అధికారులు సస్పెండ్ చేశారు. వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఏడో బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆదివారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు కమాండెంట్ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సస్పెన్షన్ ఎత్తివేయకుంటే ఉద్యోగాలను సైతం వదులుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం తమ కుటుంబీకులు నిరసనలు చేస్తే, సమస్యలు పరిష్కరించకుండా సస్పెండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సివిల్ పోలీసులకు ఇతర విధులు ఇవ్వడం సరికాదని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

## నేడు బస్వాపూర్ విండో చైర్మన్‌గా మద్దిస్వామి ప్రమాణ స్వీకారం

భిక్కనూరు, అక్టోబర్ 27: మండలంలోని బస్వాపూర్ సింగిల్ విండో చైర్మన్‌గా మద్ది స్వామి నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. గెజిట్ నోటిఫికేషన్ లేకుండా విండో విభజన సరికాదని ఇటీవల హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు సహకార శాఖ అధికారులు.. గతంలో విండో చైర్మన్‌గా ఉన్న కిష్టాగౌడ్‌పై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకొని, వైస్ చైర్మన్‌గా ఉన్న మద్దిస్వామిని ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించనున్నట్లు డీసీవో రామ్మోహన్ ఆదివారం తెలిపారు.

## సీనియర్ వైద్యుడు బాపురెడ్డి కన్నుమూత



ఖలీల్‌వాడి, అక్టోబర్ 27 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ సీనియర్ వైద్యుడు జాల బాపురెడ్డి (75) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ సెల్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాపురెడ్డి..శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో తుది శ్వాస విడిచారు. ఫిజీషియన్‌గా నాలుగు దశాబ్దాలకు పైగా వైద్య సేవలందించారు. పూర్వపు కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన బాపురెడ్డి ..టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్) వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. కేసీఆర్‌కు అత్యంత ఆప్తుడిగా ఉన్న బాపురెడ్డి .. ఎన్నికల సమయంలో బీజేపీలోకి వెళ్లారు. బీజేపీ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి ఆధ్వర్యంలో కొనసాగుతున్న కార్యక్రమాలకు సమన్వయకర్తగా పని చేశారు. ఐఎంఏలోనూ సీనియర్‌గా పలు పదవులు చేపట్టారు. డాక్టర్ బాపురెడ్డి మృతికి వైద్యులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# మళ్లీ వాపస్ పంపారు.. సోయా రైతుల ఆందోళన

- బస్తాలను వెనక్కి పంపిన నిర్వాహకులు
- 51 కిలోల కాంటా పెట్టిన బ్యాగు... 45 కిలోలతో తిరిగిచ్చిన వైనం
- రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన అన్నదాతలు

పొతంగల్, అక్టోబర్ 27: విక్రయించిన సోయా వాపసు రావడంపై రైతులు మళ్లీ ఆందోళన చేపట్టారు. విక్రయిస్తున్న సమయంలో 51 కిలోల కాంటా పెట్టిన బ్యాగు 45 కిలోలతో తిరిగి ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ పొతంగల్ మండలం హెగ్డోలి కొనుగోలు కేంద్రం వద్ద ఆదివారం రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఎలక్ట్రానిక్ కాంటాపై సోయాబస్తా ఉంచి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సోయా కొనుగోలు చేసిన అనంతరం మరోసారి సగం ధాన్యం వాపసు వచ్చిందని తెలిపారు. సుమారు పదిమందికి చెందిన 102 సోయా బ్యాగులను తీసుకెళ్లాలని సొసైటీ అధికారులు చెబుతున్నారని వాపోయారు. కొనుగోలు చేసిన ధాన్యం బాగోలేదని అంటున్నారని మండిపడ్డారు. తేమ శాతం, మ్యాచర్ వచ్చిన తర్వాతే కొనుగోలు చేశారని, ఇప్పుడు బాగోలేదని వాపసు పంపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కొనుగోలు చేసినప్పుడు కిలో తరుగుతో 51 కిలో కాంట చేసిన సోయా బ్యాగు.. వాపసు వచ్చిన తరువాత 45 కిలోలకు చేరిందని ప్రత్యక్షంగా కాంటా చేసి చూపించారు. దీనికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. వాపసు పంపిన ధాన్యాన్ని అధికారులే పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



వాపసు వచ్చిన సోయా బ్యాగును కాంటాపై ఉంచి ఆందోళన చేస్తున్న రైతులు

## కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని నిరసన

ఎడపల్లి, అక్టోబర్ 27: మండలంలోని పోచారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. రైతుభరోసా ఎగ్గొట్టిందని మండిపడ్డారు. సన్నరకాలకు రూ.500 బోనస్ ఇచ్చుడు దేవుడెరుగు ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు తాము పండించిన పంటను దళారులను అమ్మి నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు కోల సాయిలు, తోట దేవన్న, శంకర్, సుంకరి పోచయ్య, గోపి, బాయి కాడి అబ్బయ్య, పోశెట్టి పాల్గొన్నారు.



పోచారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిరసన వ్యక్తంచేస్తున్న రైతులు

## తడిసి.. మొలకలొచ్చాయి

- ధాన్యాన్ని వెంటనే సేకరించాలి
- ప్రభుత్వానికి రైతుల వినతి



రుద్రూర్ గ్రామశివారులో మొలకలు వచ్చిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

రుద్రూర్, అక్టోబర్ 27 : రైతులు కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సేకరించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి కోతలు కోసి 15 రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని సేకరించడం లేదని రైతులు వాపోతున్నారు. మొన్నటి వరకు కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసిముద్దయ్యిందని, ధాన్యానికి మొలకలు కూడా వచ్చాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని రోడ్లు, కల్లాలు, ఆరుబయట ఆరబోస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు ధాన్యాన్ని సేకరించకపోడంతో రైతులు దిక్కుతోచక దళారులను ఆశ్రయిస్తున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే సేకరించాలని కోరుతున్నారు.